క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి


పత్రాలు అందిస్తున్న ఆనందరెడ్డి

చొప్పదండి: పట్టణంలోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం టాలెంట్ టెస్టు నిర్వహించారు. పదిహేను మందిని ఎంపిక చేసి ఇంటర్మీడియట్ కళాశాల ఫీజులో సగం ఖర్చు భరిస్తామని గీతా విద్యాలయం చైర్మన్ గుర్రం ఆనందరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా టాలెంట్ టెస్టులో ఎంపికైన విద్యార్థులకు మెమొంటో, రాయితీ పత్రాలను అందించారు. కుమారుడు గుర్రం విష్ణువర్ధన్ రెడ్డి స్మారకంగా పేద విద్యార్థులకు ఉపయోగకరమైన పనులను చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో గుర్రం అవంతి, అమిరిశెట్టి రత్నాకర్‌రెడ్డి, గుండేటి వెంకటరమణ, కనుకయ్య, రుఆజయ్య రాంప్రదసాద్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగులో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు


ఆహ్వానపత్రిక అందిస్తున్న సభ్యులు

రామడుగు: మండల కేంద్రంలో నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు రావాలని అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావును బుధవారం కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ లంక మల్లేశం, గౌరవధ్యక్షుడు కలిగేటి లక్ష్మణ్, సభాధ్యక్షులు తడగొండ హన్మంతు, అరపెల్లి ప్రశాంత్, ఎడవెల్లి మల్లేశం పలువురు పాల్గొన్నారు.

ఏకశిలా విద్యార్థుల ప్రతిభ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామం ఏకశిల పాఠశాల విద్యార్థులు ఐఐటీ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబర్చారని పాఠశాల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి బుధవారం తెలిపారు. 83 మంది విద్యార్థులు ఐఐటీ పోటీ పరీక్షల్లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి. లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, పాఠశాల స్టాఫ్ ఇన్‌చార్జ్ దూడల నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐక్యతతో ముందుకుసాగాలి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

గంగాధర: సమస్యల పరిష్కారానికి క్రైస్తవులు ఐక్యతతో ముందుకుసాగాలని చొప్పదండి నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం పిలుపునిచ్చారు. గంగాధరలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశానికి హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో క్రిస్టియన్లు ఎక్కువగా ఉన్నా ఏ ప్రభుత్వం సహాయ సహకారాలు అందించలేదన్నారు. అన్ని మండలాల్లో కమ్యూనిటీ భవనాలు, శ్మశాన వాటికలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పీటర్, యాదిప్రకాశ్, జోగు దేవదాసు, దావీదు,పౌలు, మత్తాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి


మెమోరాండం అందిస్తున్న దుబ్బనీరజ

మానకొండూర్: వైఎస్సార్‌టీపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబ్బ నీరజ బుధవారం టీ సేవ్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు మెమోరాండం అందజేశారు. ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల స్కాలర్‌షిప్‌లు తక్షణం విడుదలచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో భాగ్యలక్ష్మి, మహిపాల్‌రెడ్డి, బాపురెడ్డి, శ్రావణ్‌పటేల్ పాల్గొన్నారు.

కొనుగోళ్లకు పడిగాపులు

- గంగాధర మండలంలో వరికోతలు షురూ...
- కేంద్రాల వద్ద పేరుకుపోతున్న ధాన్యం రాశులు

గంగాధర: మండలంలో వరికోతలు మొదలయ్యాయి. ధాన్యం ఆరబోసుకోవడానికి పొలాల వద్ద కల్లాలు, ఇళ్ల వద్ద స్థలం కరువై కొనుగోలు కేంద్రాల వద్ద, ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ ధాన్యం రాశులుగా పోస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇంకోవైపు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకోవడానికి రైతులకు పడిగాపులు తప్పడం లేదు. వారం రోజుల క్రితమే కోతలు మొదలయ్యాయి. కొద్ది రోజుల్లో వరికోతలు ఊపందుకునే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.


కురిక్యాలలో ఆరబోసిన ధాన్యం

33 కొనుగోలు కేంద్రాలు

మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో వానాకాలం, యాసంగిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. గంగాధర, కురిక్యాల సహకార సంఘాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోళ్లు చేస్తారు. యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వం కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కాగా మండలంలో కొనుగోళ్లకు ఇప్పటివరకు ఎటువంటి ఏర్పాట్లు ప్రారంభించలేదు.

తగ్గిన సాగు విస్తీర్ణం

మెట్ట ప్రాంతం గంగాధర మండలంలో నారాయణపూర్ రిజర్వాయర్‌తో పాటు, వరద కాలువ ద్వారా చెరువులు, కుంటలు నింపారు. దీంతో భూగర్భ జలాలు పెరగడంతో నాలుగైదేళ్లగా మండలంలో వరిసాగు విస్తీర్ణం ఘననీయంగా పెరిగింది. గతంలో యాసంగిలో మూడు, నాలుగు వేల ఎకరాలు దాటని వరిసాగు ప్రస్తుతం ఐదింతలు పెరిగింది. గత వర్షాకాలంలో కురిసిన వర్షాలకు నారాయణపూర్ చెరువు, గంగాధర ఎల్లమ్మ చెరువు కట్టలకు గండ్లు పడటంతో పంట పొలాలు కొట్టుకుపోయాయి. మరోవైపు భూగర్భ జలాల మట్టం తగ్గడంతో సాగు విస్తీర్ణం పడిపోయింది. గతంలో ఇరవై వేల ఎకరాలకు మించి వరి సాగైతే. ప్రస్తుతం పద్దెనిమిది వేలకుపైగా ఎకరాల్లో వరి సాగు చేశారు. సాగు నీటి సమస్యతో కొన్ని ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. అకాల వర్షాలకు సైతం పంటపొలాలు ధ్వంసమయ్యాయి.

ప్రైవేటు వ్యాపారులవైపు మొగ్గు

గత సీజన్ కంటే మద్దతు ధర పెంచినప్పటికీ రైతులు ప్రైవేటు వ్యాపారులవైపే మొగ్గు చూపుతున్నారు. గతంలో క్వింటాల్‌కు రూ.1,960 ఉండగా ప్రస్తుతం రూ.2,060 పెంచారు. మండలంలోని పలువురు రైతులు క్వింటాల్‌కు రూ.1,650 అమ్ముకోవడానికి మొగ్గు చూపుతున్నారు. గతంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుంటే క్వింటాల్‌కు మూడు నుంచి నాలుగు వందల వరకు ఖర్చయ్యేది. డబ్బులకు నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. గత వర్షాకాలంలో చాలామంది రైతులు ప్రైవేటు వ్యాపారులకే ధాన్యం అమ్ముకున్నారు.

కొనుగోళ్లు ప్రారంభించాలి



కేంద్రాల వద్ద ధాన్యం పోసి పడిగాపులు కాస్తున్నాం. కేంద్రాలు ప్రారంభించినా తర్వాత తాలు, తడి, అంటూ మరిన్ని రోజులు జాప్యం చేస్తారు. వెంటనే కేంద్రాలు ప్రారంభించి ఎటువంటి వంకలు పెట్టకుండా ధాన్యం తూకం వేయాలి.

– మడుపు లింగారెడ్డి,రైతు, కురిక్యాల

సెంటర్లు ఏర్పాటు చేస్తాం



మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో త్వరలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మద్దతు ధర గత వానాకాలంలో రూ. 2,060 పెంచింది.

– రాజు, వ్యవసాయ అధికారి

సిర్సపల్లిలో పెట్రోల్‌బంక్ ప్రారంభం


పెట్రోల్‌బంక్‌ను ప్రారంభిస్తున్న కొండాల్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని సిర్సపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను బుధవారం పీఏసీఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముద్రబోయిన శంకర్, గ్రామ సర్పంచ్ సునిత,ఎంపీటీసీ రాధమ్మ,మాజీ సర్పంచ్ ఎడవెల్లి పద్మారెడ్డి,మాజీ మార్కెట్ చైర్మన్ పోల్సాని రామరావు, నాయకులు విజయ్ కుమార్, వంగల వెంకట్ రెడ్డి, ఎడవెల్లి సంపత్ రెడ్డి, అనుమండ్ల సమ్మిరెడ్డి, మల్లారావు,కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ శ్యాంసుందర్ రెడ్డి, డీఈ రాజయ్య తదితరులు ఉన్నారు.

14న పాలిసెట్ మాదిరి పరీక్ష

కరీంనగర్: పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులకు సాంకేతిక విద్యలో డిప్లొమా చేయడానికి నిర్వహించే అర్హత పరీక్షకు సంబంధించిన మోడల్ పేపర్‌ను నగరంలోని ముకరంపురలోని కిట్స్ అకాడమీలో ఈనెల 14న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9346217513 నంబర్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

ఇల్లందకుంట: బాల్యవివాహాల నిర్మూలన సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు తేజస్విని, రమేశ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వాగొడ్డురామనపల్లి గ్రామంలో సమగ్ర బాలల పరిరక్షణ విభాగం, శిశుమహిళా బాలల హక్కుల గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాల్యవివాహాలు, లైంగిక వేధింపులు, అక్రమరవాణా, దత్తత, బాలకార్మికులు తదితర అంశాలను వివరించారు. బాలబాలికలు ఏమైనా ఇబ్బందులుంటే చైల్డ్ లైన్ 1098 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుట్ట రాజు, ఐసీడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం


శంకరపట్నం: కంటిపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది


జమ్మికుంట: శిబిరాన్ని ప్రారంభిస్తున్న సుజాత

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామంలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ వనపర్తి మల్లయ్య ప్రారంభించారు. పంచాయతీ లో ఏర్పాటు చేసిన శిబిరంలో ప్రజలకు వైద్యఆరోగ్య సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారు పరీక్షలు చేసుకోవా లని ఏఎన్ఎం మల్లిక సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుపతయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని శాయంపేట గ్రామంలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సుజాత ప్రారంభిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్యాంప్ మెడికల్ ఆఫీసర్ సంధ్యారాణి, ఉప సర్పంచ్ లింగంపల్లి రవీందర్, సూపర్‌వైజర్స్ స్వరూప, సాంబయ్య, ఆరోగ్య సిబ్బంది నరేందర్, శాంత, తిరుపతమ్మ, ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంబురాలు


జమ్మికుంట: సంబరాలు చేసుకుంటున్న ఉద్యోగులు


మానకొండూర్‌రూరల్: ఎంపీడీవో ఆఫీస్‌లో..

మానకొండూర్‌రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపీడీవో కార్యాయలంలో బుధవారం కార్యదర్శులు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యదర్శుల మండల అధ్యక్షుడు పవన్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, వివిధ గ్రామాల సెక్రటరీలు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని రైతు వేదికలో సంబరాలు జరుపుకున్నారు. పర్మినెంట్ అయ్యేందుకు ప్రజాప్రతినిధులు చొరవచూపాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరెల్లి జ్యోత్స్న, సర్పంచులు దిలీప్‌రెడ్డి, మొగిలి,ఎల్లారెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు వాసుదేవరెడ్డి, మహేందర్, నాగన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జమ్మికుంట: తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) ఇచ్చిన పిలుపు మేరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. టీపీఎస్ఎఫ్ జమ్మికుంట అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శైలజ, టీపీఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షుడు సందీప్, ట్రెజరర్ మధు, సాంబయ్య, రాజేందర్ పాల్గొన్నారు.


ఇల్లందకుంట: కేక్ కట్ చేస్తున్న వైస్ ఎంపీపీ జోత్స్న, తదితరులు

‘హరీ’తహారం మొక్కలు

- నర్సరీల్లో ఎండిపోతున్న మొక్కలు,
- ముదురుతున్న ఎండలతో నీరు అందడం కష్టమే
- ప్రణాళికతో చర్యలు చేపడితేనే మనుగడ సాధ్యం

హుజూరాబాద్‌రూరల్: గ్రామాలను హరితవనాలుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం హరితహరం కార్యక్రమం చేపట్టింది. కానీ ముదురుతున్న ఎండలకు మొక్కల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఏప్రిల్‌లోనే ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత అధికారులు, హరితసైనికులపై ఉంది. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఇప్పుడిప్పుడే ఏపుగా పెరుగుతుండగా ఎండల వేడికి కొన్ని ప్రాంతాల్లో ఎండిపోతున్నాయి. ముఖ్యంగా మొక్కలకు నీటి సమస్య తీవ్రం కానుంది. కొన్ని ప్రాంతాల్లో ఉపాధి హామీ కూలీలు, హరిత సైనికులు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో మొక్కలకు నీరందే పరిస్థితి లేదు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యాచరణ అమలైతేనే మొక్కలు మనుగడ సాధ్యం. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్ట్యా అధికారులు చర్యలు తీసుకోవాలి. లేదంటే ప్రభుత్వ లక్ష్యం ఫలించదు.

హుజూరాబాద్ మండలంలో 19 గ్రామపంచాయతీలు, అనుబంధ గ్రామాలను కలుపుకొని మొత్తం 23 గ్రామాలు ఉన్నాయి. ఆయాగ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, పొలం గట్లు, చెరువు కట్టలపై, ఖాళీ ప్రదేశాల్లో హరితహార కార్యక్రమంలో వివిధ రకాల మొక్కలు నాటారు. అయితే గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు, యువజన సంఘాల సభ్యులు, హరిత రక్షణ, కమిటీలు, గ్రామస్తులు నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతలు చేపట్టారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మొక్కలు నాటించారు.


చిన్నపాపయ్యపల్లి గ్రామంలోని నర్సరీలో మొక్కల సంరక్షణకు ఏర్పాటు చేసిన గ్రీన్‌షెడ్

సంరక్షణ చర్యలు చేపట్టాలి

ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు ఇలా ఉంటే మే నెలలో ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండల కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం కనిపించడం లేదు. హరిత సైనికులతో పాటు మొక్కల పెంపకాన్ని దత్తత తీసుకున్న గ్రామస్థాయి అధికారులు స్పందించి మొక్కల సంరక్షణను చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అడుగంటిన భూగర్భజలాలు

మండలంలో అటవి సంరక్షణశాఖ ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కల పెంపకం జరుగుతోంది. నర్సరీలో పెంచుతున్న మొక్కలను వర్షకాలంలో ఇంటింటికి పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పెద్దపాపయ్యపల్లి, కేసీ క్యాంపు, కొత్తపల్లి,కందుగుల, సింగాపూర్, తుమ్మనపల్లి తదితర గ్రామాల్లో నర్సరీలు ఉన్నాయి. వేసవి కాలం ప్రారంభమవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఫలితంగా వన సంరక్షకులు మొక్కలకు నీరు పట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు.

జాగ్రత్తలు చేపట్టాలి

వేసవిలో అధికారులు ప్రణాళిక బద్ధమైన చర్యలు చేపడితేనే మొక్కలు బతుకుతాయి. గ్రామాల్లో నాటిన మొక్కలను రక్షించేందుకు ప్రభుత్వం హరిత సైనికులను సైతం నియమించింది. మొక్కల చుట్టూ ఉన్న చెత్తాచెదారం తొలగించడం మూగజీవాల నుంచి రక్షణకు ట్రీగార్డులను ఏర్పాటు, సకాలంలో నీరందించడంతో పాటు మొక్కలు ఏపుగా ఎదిగేలా జాగ్రత్త చర్యలు చేపట్టాలి. గ్రామాల్లోని వ్యవసాయబావుల నుంచి నీటిని ట్యాకంర్ల ద్వారా మొక్కలకు పూర్తి స్థాయిలో అందిస్తే బతికే అవకాశం ఉంది.

ప్రస్తుతం నీటి సమస్య లేదు



నర్సరీలోని వివిధ రకాల మొక్కలకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళలో సమృద్ధిగా నీళ్లు పడుతున్నాం. ప్రస్తుతానికి నీటి సమస్య లేదు. కానీ మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు.

– మమత, వనసేవకురాలు, తుమ్మనపల్లి

మూడుపూటలా నీళ్లు..



నర్సరీల్లో మొక్కలు ఎండకుండా మూడు పూటలా నీళ్లు పడుతున్నాం. బోర్లలో నీళ్లు తక్కువ వస్తే మొక్కలకు నీళ్లు అందించడం ఇబ్బంది అవుతుంది. మొక్కలను గ్రీన్ మ్యాట్ కింద ఉంచి నీరు అందిస్తున్నాం.

– గజవెల్లి రేణుక, వనసేవకురాలు, రాజాపల్లి

ప్రతి మొక్కను సంరక్షిస్తాం



నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం.మొక్కల సంరక్షణ బాధ్యత హరిత సైనికులు చూస్తున్నారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటే చర్యలు చేపడుతున్నాం.

– విజయలక్ష్మి, ఎంపీడీవో, హుజూరాబాద్

అగ్నిప్రమాదంపై విచారణ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేటలో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన కిరాణ దుకాణంపై బుధవారం తహసీల్దార్ నారాయణ విచారణ చేపట్టారు. ప్రమాదం జరిగిన ఇల్లును పరిశీలించి ఇంటి యజమాని మల్లయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం మంజూరు కోసం జరిగిన నష్టాన్ని అంచనా వేసి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, ఎంపీటీసీ బుర్ర తిరుపతి, సర్పంచ్ భూమయ్య, ఆర్ఐ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని పరామర్శించిన రోహిత్‌రావు

అగ్నిప్రమాదంలో నష్టపోయిన కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు మెన్నేని రోహిత్‌రావు బుధవారం పరామర్శించారు.అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తిరుపతిగౌడ్, రాంరెడ్డి, నాగప్రసాద్, రాజిరెడ్డి, లక్ష్మణ్, కనుకయ్య, శంకరయ్య, స్వామిగౌడ్, హరీశ్‌గౌడ్ తదితరులున్నారు.


వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ నారాయణ

ఆధ్యాత్మికం

మడేలయ్య పట్నాలు


మున్సిపల్ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న రజక సంఘం సభ్యులు

చొప్పదండి: పట్టణంలోని మడేలయ్య ఆలయంలో రజక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మడేలయ్య పట్నాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివచ్చి స్వామివారికి మొక్కులు సమర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కౌన్సిలర్లు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. రజక సంఘం నాయకులు మెమెంటో అందించి సత్కరించారు. పలు పార్టీలకు చెందిన నాయకులు మడేలయ్యను దర్శించుకున్నారు.

శ్రీబాలాంజనేయస్వామి ఆలయంలో పూజలు

మానకొండూర్: మానకొండూరులోని శ్రీబాలాంజనేయస్వామిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు సతీమణి మమత దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని జీవీఆర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిట్టల కవితమధు, బీఆర్ఎస్ నాయకులు నెల్లి శంకర్, పిండి సందీప్, ఆలయ కమిటీ సభ్యులు బొద్దుల ఆంజనేయులు, నందగిరి బలరామ్, కత్తి తిరుపతి, అనిల్ నాయకులు పాల్గొన్నారు.


బాలాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జీవీఆర్